

దూసి విజయలక్ష్మి

దూరంగా పన్నెండు గంటలు వినిపించాయి. తుళ్ళిపడి లేచిన ఇందిరకు మంచంమీద ప్రసాదు కనిపించలేదు. తలుపులు రెండు తీసిఉన్నాయి. చుట్టూ పరిశీలించి మెల్లిగా లేచి డాబా ఎక్కింది. డాబా గోడ మీద కూచుని శ్మశానంవైపు తదేకంగా చూస్తూ సిగరెట్టు పీలుస్తున్నాడు ప్రసాదు. ఇందిర ప్రసాదు చెయ్యి పట్టుకుని "మంచు పడుతూంటే ఈ డాబా మీద కూచున్నారా" అంటూంటే చిన్నపిల్లాడికిమల్లే వెనకగా నడిచి వచ్చాడు.

పక్కమీద దొర్లుతూన్నదే కాని ఇందిరకు నిద్ర పట్టలేదు. సినిమాల్లో చూసింది కథల్లో చదివింది. కాని నిజ జీవితంలో ఇలాటి పరిస్థితిని ఎదుర్కోవలసి వస్తుందనుకోలేదు. ప్రసాదు ఉదాసీనవైఖరి చూసి తన తల్లి "అబ్బాయితత్వం ఏమిటో అనుమానంగా ఉంది. కనుక్కోండి" అంటూ చెవి నిల్లు కట్టుకొని పోరింది. "అబ్బాయి అందంగా ఉన్నాడు. బాగా చదువుకున్నాడు. మన అమ్మాయి అదృష్టవంతురాలు" అనేవాడు నాన్న. తన అదృష్టం ఎలా ఉందో ఇప్పుడు వాళ్ళిద్దరికీ తెలియడంలేదు.

* * *

కిటికీలోంచి ముఖంమీద ఎండ పడేవరకు ఇందిరకు తెలివిరాలేదు. బాత్‌రూములోకి వెళ్ళి తిరిగివస్తూన్న ఇందిరకు హాల్లో డైరీ రాస్తూ ప్రసాద్ కనిపించాడు.

"కాఫీ తాగేరా?"

"ఊహుఁ."

కాఫీ తయారుచేసి రెండు కప్పులతో పట్టుకువచ్చి

ప్రసాదు కొక కప్పు అందించింది. రేడియోలో సిలోన్ పెట్టి కూచుంది. "కోయీ సాగర్ దిల్‌కు బెహలాతా నహీ."

"అబ్బబ్బ! రేడియో కడుదు. నేను వెళ్ళిన తరవాత పెట్టుకుందుగాని" ఇందిర చిన్నబుచ్చుకుని వెళ్ళిపోయింది.

* * *

బూట్లు టక టక శబ్దం చేసుకుంటూ బయటకు నడిచాడు ప్రసాదు. ఇందిర వీథి తలుపులు రెండు గడియపెట్టింది.

మెల్లిగా గదిలోకి నడిచింది. గదినిండా సిగరెట్టు ముక్కలే! డ్రాయరు దగ్గిరకి వెళ్ళి తియ్యబోయి మళ్ళీ ఆగిపోయింది. గదిలో ఏమి తోచనట్టు ఇటు అటూ తిరగడం ఆరంభించింది. 'ఛ. మర్యాదైన పనికాదు. ఒకరి డైరీలు మరొకరు చూడడం సంస్కారం కాదు. . . కాని ప్రసాదు మనస్సులోఉన్న బాధ ఏమిటి! అదేమిటో తెలుసుకోవాలి. డైరీ చదివినంత మాత్రంలో నష్టమేమిటి! అతని ప్రవర్తనకు కారణ మేమిటో తెలుసుకుంటే చాలు. అతన్ని ఏమీ అడగడం తన ఉద్దేశంకాదు.' ఒక నిశ్చయానికి వచ్చి డ్రాయరు తెరిచింది. డైరీ తన చేతిలోకి తీసుకొని కిటికీ దగ్గిర వెళ్ళి బయటకొకసారి చూసి వచ్చి కూచుంది.

* * *

"ఈ రోజు శారద అన్న అమ్మాయిని పరికించి చూశాను. మాటలుకూడా విన్నాను. చలాకీగా ఉంటుంది. నవ్వుముఖంతో కులాసాగా ఉంటుంది."

. . . . . . . . . . . . . . .

"శారద చాలా బాగా పాడుతుంది. ఎప్పుడు మల్లెపువ్వులాంటి బట్టలు వేసుకుంటావేమిటని అడిగితే తనకి తెలుపంటే ఇష్టమన్నది. నిజానికి నాకూ బాగా నచ్చింది."

. . . . . . . . . . . . . . .

"అబ్బ. సెలవులెంత బాధిస్తున్నాయి! శారద లేకపోతే ఎంత మందకొడిగా ఉంటుందో అర్థం ఔతూంది."

. . . . . . . . . . . . . . .

"రోజులూ నెలలూ నిమిషాల్లా గడిచిపోతున్నాయి. శారద ఎలా ఉందో కాని నా మట్టుకు ఆమె కనిపించకపోతే పిచ్చెక్కినట్టుంటూంది."

. . . . . . . . . . . . . . .

"సంవత్సరాలు గడుస్తున్నకొద్దీ విడిపోయే సమయం దగ్గిర అవుతూందన్న భయం ఎక్కువవుతూంది. గత నాలుగు సంవత్సరాలూ నా జీవితాన్ని శారదామయం చేశాయి."

. . . . . . . . . . . . . . .

"ఫైనలియర్‌పరీక్షలై విడిపోతున్నామని ఉంగరాలు మార్చుకుందామని శారదను కోరాను. నా బేలముఖాన్ని కన్నీళ్లను చూసి శారద నేను పిచ్చివాణ్ణి అనుకుందేమో! కాదనలేదు. నా చేతిలోఉన్న తన చేతిని తీసుకుంటూ "అభిమానం పెంచుకున్నకొద్దీ బాధే మిగులుతుందేమో అని నా భయం" అన్నది. శారద కళ్ళలోకూడా నీరు నిల్చింది. ఎప్పుడూ చలించని శారద కంటనీరు చూడగానే నే నెంతో కదిలిపోయాను. కాని ఆ సన్నివేశం నాకు సంతృప్తినిచ్చింది. మా కలయికమీద నమ్మకం పెరిగింది. రాకాసిలా అరుసుకుంటూ మా చేతులు విడదీసి రైలు శారదను లాక్కుపోయింది."

. . . . . . . . . . . . . . .

"నిజమే! నాకు ధైర్యం లేదు. జీవితాన్ని ఎదుర్కోలేను. పరిస్థితులకు లొంగిపోతున్నాను. మానసికంగా కుంగిపోతున్నాను. శారద నాగురించిఏమనుకుంటుందో."

. . . . . . . . . . . . . . .

"ఎంత సంపాదిస్తే ఏం లాభం! ఎన్ని శక్తిసామర్థ్యాలు ఉంటే ఏం! జీవితంలో కోరుకున్నది బాహాటంగా చెప్పి చెయ్యలేని పిరికితనంలో బ్రతకవలసి వస్తూంది."

. . . . . . . . . . . . . . .

"నాకీ బాధనుంచి విముక్తి లేదు. నేను వ్యర్థజీవిని."

* * *

యాంత్రికంగా వీధిగేటు వేసుకొని ఇంట్లో అడుగు పెడుతున్న ప్రసాదుకు ఇంట్లోంచి కిలకిలా నవ్వులు వినిపించాయి. ఆగిపోయాడు. చాలాకాలమై అల్లాంటి వాతావరణానికి దూరమైపోయిన ప్రసాదు—లోపల ఎవరున్నది ప్రశ్నించుకోకుండానే, వెనుదిరిగిపోదామనుకున్నాడు.

ఎవరిదో మగగొంతు ఛలోక్తి విసిరాడు.

రెండు ఆడగొంతులు నవ్వుతున్నాయి.

ప్రసాదు మెల్లిగా లోపలికి ప్రవేశించాడు. వెనుదిరిగి ఒక స్త్రీ కూచుంది. పక్కను ఆమె భర్త కాబోలు కూర్చున్నాడు. ఇందిర వారిద్దరికీ ఎదురుగా కుర్చీలో ఉంది. ముగ్గురు కాఫీ తాగుతున్నారు. ప్రసాదుని చూసి ఇందిర లేచింది. "మావారు డాక్టర్ ప్రసాద్" పరిచయం చేసింది. తక్కిన ఇద్దరు లేచి నిల్చుని నమస్కారం చేశారు.

"ఈమె నా స్నేహితురాలు శారద. ఆమె భర్త మధుసూదన్ ఇంజనీర్." ప్రసాద్ నిర్లిప్తంగా 'గ్లాడ్ టు మీట్ యు' అని కరచాలనం చేశాడు. శారదవైపు చూసిన ప్రసాద్‌ముఖం రంగులు మారింది. శరీరం అంతా చిరుచెమటపట్టి తొట్రుపాటు పడ్డాడు.

"అర్జెంటు కేసుంది ఇందిరా! వెళ్ళివస్తాను." అంటూ మధుసూదన్‌వైపు తిరిగి "మీతో కూచోలేక పోతున్నాను. క్షమించండి" అని జవాబుకి ఎదురు చూడకుండా బయటకు నడిచాడు.

ఇందిర కొంచెం ఇబ్బంది పడింది. 'ఎందుకంత తొట్రుపడి ప్రసాదు ఈ వాతావరణం నుంచి తప్పించుకున్నాడు! శారదను చూడగానే ఎందుకలా వివర్ణం అయిపోయాడు! ఈ శారదేనా ప్రసాద్ డైరీల్లో శారద! అయితే శారద సుఖంగానే ఉంది! ప్రసాదుమట్టుకు ఇంకా ఆ శారదను తల్చుకొని బాధపడుతూనే ఉన్నాడు.'

ప్రసాదు వెళ్ళినవైపే చూస్తూ ఆలోచనలో పడిన ఇందిరతో "డాక్టరువృత్తి అలాంటిది. రేపు మన చేతిలో ఉండదు" అన్న మధుమాటలు వాతావరణాన్ని మళ్ళీ యథాస్థితికి తీసుకువచ్చాయి.

"ఇక వెళదామండీ" అంటూ శారద మధువైపు తిరిగింది.

"వస్తామండీ" అంటూ మధు లేచాడు.

ఇందిర మౌనంగా ఇద్దర్నీ సాగనంపి ఇంట్లోకి వచ్చి కూలబడింది. నిశ్శబ్దంగా ఉన్న ఆ వాతావరణం ఈ రోజు భయంకరంగా ఇందిరను భయపెడుతూంది.

* * *

రాత్రి పదిగంటలకు తలుపు చప్పుడయింది. బూట్లశబ్దం వినిపించింది. ఇందిర వెళ్ళి తలుపు తెరిచింది.


ప్రసాద్ ఇంట్లో అడుగుపెట్టాడు. అతను బట్టలు మార్చుకుంటున్నాడేగాని ఏదో లోకంలో ఉన్నట్టున్నాడు. ముఖంలో ఏ రకమైన భావము కనిపించలేదు. ఇలాంటి నిర్వికారమైన ముఖాన్ని మొదటిసారిగా చూసిన ఇందిర ఎందుకో భయపడింది.

"భోజనం చెయ్యరూ?"

"ఆకలి లేదు. తలనొప్పిగా ఉంది."

"కొంచెం తినండి. భోజనం మానేస్తే వేడి చేస్తుంది."

"సరే! నీ ఇష్టం."



మృణ్మయ నృత్యం

ఫోటో—బ్రహ్మదేవ్ (డెహ్రాడూన్)

ఇన్నాళ్ళకు 'నీ ఇష్టం' అంటూ దీనంగా జారిపోతున్న ప్రసాదు ఏదో అగాధంలోకి పడిపోతూ ఆక్రందిస్తున్నట్టు ఇందిరకు అనిపించింది. ఎందుకో ఆమె కళ్ళలో నీరు తిరిగింది.

"రండి. వడ్డిస్తాను" అంటూ ముందు నడిచింది.

ప్రసాదు భోజనాలగదిలోకి రాలేదు. ఎదురు చూసిచూసి పిలుచుకు వెళదామని తిరిగివచ్చిన ఇందిరకు గదిలో చీకటిలో పక్కమీద దొర్లుతున్న ప్రసాద్ కనిపించాడు. లైటువేసి చూసేసరికి అతనేదో బాధపడుతున్నట్లు కనిపించాడు. ఇందిర ఒళ్ళు కంపించింది. వణికిపోతూ "ఏమైందండీ?" అని దగ్గిరకి వచ్చింది. ప్రసాద్ లేచి ఆమె ఒళ్ళోకి వాలిపోతూంటే అతని చేతిలో ఇంజక్షన్ సీసా కిందపడి బద్దలైంది!